క్లుప్తంగా

ఆలయ గడప ప్రతిష్ట



రాతిగడపకు పూజలు చేస్తున్న దాతలు, అధికారులు

మద్దికెర : మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన రంగనాథస్వామి దేవాలయం రాజగోపురం ముందు రూ.4 లక్షలతో రాతి స్వాగత ద్వారం నిర్మించేందుకు దాతలు పారా రామచంద్రప్రసాద్, పారా విశ్వనాథ్ (చిట్టెన్న) గురువారం రాతి గడప ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆవరణలో రాతి గడపకు పూజలు నిర్వహించి ప్రతిష్ఠించారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్, పాలకమండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచలోహ విగ్రహాల విరాళం



పంచలోహ విగ్రహాలను విరాళంగా అందిస్తున్న చెన్నారెడ్డి

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయానికి కందనాతి గ్రామానికి చెందిన భక్తుడు చెన్నారెడ్డి దంపతులు పంచలోహ విగ్రహాలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో నూతనంగా నిర్మించిన శివాలయంలో 2024 ఫిబ్రవరి 20, 21, 22 తేదీల్లో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామానికి చెన్నారెడ్డి దంపతులు శివపార్వతులు, రామలక్ష్మణులు, ఆంజనేయ స్వామి విగ్రహాలను విరాళంగా అందించారని వివరించారు. గ్రామ పెద్దలు శ్రీనివాసులు, రంగారెడ్డి, రాఘవరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం



గూళ్యంలో గాదిలింగేశ్వరస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

హాలహర్వి: మండలంలోని ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం గూళ్యం గాదిలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం గాదిలింగప్ప తాత 20వ పూల రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి గాదిలింగప్ప తాతకు ఆలయ అధికారులు జలాభిషేకం, కుంభాభిషేకం, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం తాత రథాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. భక్తుల జయ జయ ధ్వనుల మధ్య గాదిలింగప్పతాత పూల రథాన్ని ఆలయం నుంచి ప్రధాన రహదారి వరకు ఊరేగించారు. ఆ తర్వాత యథాస్థానానికి చేర్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి రథానికి పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం, మంచినీరు సౌకర్యాలను అధికారులు కల్పించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హాలహర్వి పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గోరుముద్ద పథకం ద్వారా విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని హాలహర్వి పీహెచ్‌సీ డాక్టర్ పరిమళ వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. గురువారం మండల పరిధిలోని నదికైరవాడి, కొత్తకైరవాడి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని డాక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్యంపై సూచనలు చేశారు. సీహెచ్‌ఓ జైదీప్, ఏఎన్‌ఎం రాములమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి

హాలహర్వి: ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలందించాలని హొళగుంద పీహెచ్‌సీ వైద్యాధికారి న్యూటన్ సూచించారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలతో ఆరోగ్య పథకాలు, ఇతర విషయాలపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించేలా చైతన్యం కలిగించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డాక్టర్‌తో పాటు ఎంపీహెచ్‌ఈఓ రవీంద్రనాథ్, ఎంపీహెచ్‌ఎస్ సుశీల తదితరులు ఉన్నారు.

- ఆలూరు మండలం కరిడిగుడ్డం గ్రామానికి చెందిన సుజాత అనే మహిళకు తెల్లవారు జామున 3 గంటలకు పురిటి నొప్పులు రావడంతో బంధువులు 108కు కాల్ చేశారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్‌లో గర్భిణిని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యంలో నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ రంగస్వామి డెలివరీ చేయగా ఆడ బిడ్డ జన్మించింది. తల్లికూతురు ఇద్దరిని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు ఇది రెండవ కాన్పు.

- కర్ణాటక రాష్ట్రం విజయపుర (హొస్పెట) జిల్లా కేంద్రానికి చెందిన బసవరాజ్, కొట్రేష్ అనే వ్యక్తులు ఆదోనికి బైక్‌పై వెళ్తున్నారు. తెల్లవారుజామున ఆలూరు సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. ఆ మార్గంలో వెళ్లిన వారు గమనించి 108కు కాల్ చేసి సమాచారం అందించడంతో అంబులెన్స్ వచ్చి వారిని ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు బళ్లారి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. తీవ్ర రక్తస్రావం అవుతున్న వారిని అదే వాహనంలో 40 నిమిషాల వ్యవధిలోనే ఆస్పత్రికి చేర్చడంతో ఇద్దరూ ప్రాణాలతో బయటపడ్డారు.

ఆరోగ్య రథాలు.. పేదల సంజీవనులు

- వైద్య సేవలకు ఊపిరి పోసిన ప్రభుత్వం
- విశేష సేవలందిస్తున్న 108, 104, 102 వాహనాలు
- ప్రజల ప్రాణాల రక్షణలో కీలకపాత్ర
- మండలానికో 108, 104, ప్రసూతి ఆస్పత్రుల్లో సేవలందిస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్
- నియోజకవర్గంలో ఇప్పటివరకు 88,309 మందికి వైద్యసేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న రోగులు, లబ్ధిదారులు





వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్న 104 సిబ్బంది

ఆలూరు రూరల్: ఆపద వస్తే చాలు..కుయ్..కుయ్..కుయ్ అంటూ వేగంగా దూసుకొచ్చి ప్రజల ప్రాణాలను రక్షించడంలో కీలకపాత్ర పోషిస్తోంది 108 అంబులెన్స్. ఇక పల్లెల్లోని ప్రజల వద్దకే వైద్య సేవలు అందించే 104 సంచార వైద్య వాహనం. పురిటినొప్పులతో ఆస్పత్రిలో చేరి పండంటి బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తల్లీ బిడ్డను క్షేమంగా ఇంటికి చేర్చే వాహనం 102. ఇవన్నీ ఆరోగ్య రథాలుగా పేదల సంజీవనిలా ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నాయి.

టీడీపీ హయాంలో నిర్వీర్యమైన ఆరోగ్య వాహన సేవలు

దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ ఆనాడు ప్రవేశపెట్టిన 108, 104, 102 వాహన సేవలను గత టీడీపీ పాలనలో నిర్వీర్యం చేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టీడీపీ హయాంలో తీవ్ర నిర్లక్ష్యంతో ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించే పరిస్థితి లేక ప్రాణాలపై ఆశలు వదిలేసుకోవాల్సిన దుస్థితి ఉండేది. తర్వాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎం అయ్యాక ఈ అత్యవసర సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టారు.

ఆధునిక హంగులతో అత్యవసర సేవలు

ఆలూరు నియోజకవర్గంలో ఆధునిక సౌకర్యాలతో 108, 104, 102 ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఆలూరులోని హైవే-167 జాతీయ రహదారిపై ఏదైనా ప్రమాదం జరిగితే క్షణాల్లోనే క్షతగాత్రులను హాస్పిటల్‌కు చేర్చి, ప్రాణాలు రక్షిస్తున్నాయి. అంబులెన్స్‌లోనే ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉండడంతో ప్రమాదంలో తీవ్రగాయాలైనా ప్రథమ చికిత్స అందిస్తూ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. 104 ద్వారా ప్రతి గ్రామ సచివాలయానికి వెళ్లి రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు, గర్భిణులకు ఇది వరంగా మారింది. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం అనంతరం బాలింతలకు అన్ని సౌకర్యాలతో 102 వాహనాల ద్వారా క్షేమంగా ఇంటికి చేర్చడడంతో బాలింతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

108 అంబులెన్స్ సేవలు ఇలా..

- ఏదైనా అత్యవసర పరిస్థితి వస్తే అక్కడికి చేరుకుని బాధితులను హాస్పిటల్‌కు తరలిస్తారు.
- పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల నుంచి అత్యవసర పరిస్థితుల్లో రోగులను జిల్లా సర్వజన వైద్యశాలలకు తరలిస్తారు.
- రోడ్డు ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారికి తక్షణ వైద్యంతో పాటు వెంటిలేటర్ సాయంతో వేగంగా హాస్పిటల్‌కు చేర్చుతాయి.
- నైపుణ్యం కలిగిన వైద్య సిబ్బంది, ఆక్సిజన్ వెంటిలేటర్, ఇతర ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉంటాయి.

104 వాహన సేవలు ఇలా..

- ప్రతి పీహెచ్‌సీ పరిధిలో ఒక 104 వాహనాన్ని ప్రభుత్వం అందుబాటులో ఉంచింది.
- వైద్యులు 104 ద్వారా రోజూ గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి వైద్య శిబిరాలు నిర్వహిస్తారు.
- ప్రజలకు ఉచితంగా బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి మందులు అందిస్తారు.
- గర్భిణులు, బాలింతల ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు చేసి మందుల అందిస్తూ నిరంతర పర్యవేక్షణ చేస్తారు.
- అనారోగ్యంతో మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్యం పరీక్షలు చేసి మందులు ఇవ్వడం విశేషం.



అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో ఇంటికి వెళ్తున్న బాలింత

నియోజకవర్గంలో గత నాలుగేళ్లలో ఆరోగ్య రథాలు అందించిన సేవలు

108 వాహనాల సంఖ్య	6
104 వాహనాల సంఖ్య	6
102 వాహనాల సంఖ్య	4
2020 జూలై నుంచి 2023 డిసెంబర్ వరకు 108 సేవలు పొందిన వారు	46,741 మంది
2020 జూలై-2023 డిసెంబర్ వరకు 104 ద్వారా వైద్యం అందుకున్న వారు	38,698 మంది
గతేడాది ఏప్రిల్ 2022 నుంచి డిసెంబర్ 2023 వరకు 102 ద్వారా సేవలు పొందిన గర్భిణులు	2,870 మంది

క్షేమంగా ఇంటికి తల్లీబిడ్డ

- ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం అనంతరం మూడు రోజుల తర్వాత 102 వాహనంలో క్షేమంగా ఇంటికి చేరుస్తారు.

108 పునర్జన్మనిచ్చింది



నాది ఆలూరు మండలంలోని ఏ.గోనేహాల్ గ్రామం. ఏడాది క్రితం సాయంత్రం 7 గంటల సమయంలో ఆదోని నుంచి గ్రామానికి స్కూటర్‌పై వస్తుండగా ఆదోని శివారులో ఎదురుగా వచ్చిన మరో స్కూటర్ బలంగా ఢీకొట్టింది. తలకు, ముఖానికి తీవ్రగాయాలయ్యాయి. కుడికాలు, కుడి చేయి విరిగిపోయింది. 108 వాహనంలో నాకు ప్రథమ చికిత్స చేసి ఆదోని ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి కర్నూలు ఆస్పత్రికి తరలించడంతో నేను బతకగలిగాను. 108 నాకు పునర్జన్మనిచ్చింది.

– రాజశేఖర్, గోనేహాల్ గ్రామం,

ఆస్పత్రికి వెళ్లే ప్రయాస తీరింది



104 వాహనం మా వీధిలోకి వారానికోసారి వస్తుంది. నాకు బీపీ, షుగర్ ఉండడంతో ఇక్కడే డాక్టర్ పరీక్ష చేసి మందులు ఇస్తున్నారు. గతంలో ఆరోగ్యం బాగాలేకపోతే ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌కు చూపించుకునే వాళ్లం. వెళ్లలేని సమయంలో స్థానిక ఆర్‌ఎంపీ వద్దకు పోయి డబ్బులు ఇచ్చి సూది మందులు తీసుకునే వాళ్లం. ఇప్పుడు ఆ బాధలు లేవు. మా ఇంటి వద్దకే వైద్య సేవలు తెచ్చిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– మల్లయ్య, వృద్ధుడు, ఆలూరు

సేవలు బాగున్నాయి



102 వాహనంలో సేవలు బాగున్నాయి. ఏసీ ఉంది. కూర్చోవడానికి ఎలాంటి ఇబ్బంది లేదు. పైసా ఖర్చులేకుండా నన్ను నా బిడ్డను సురక్షితంగా ఇంటి చేర్చారు. జగనన్నకు నా కృతజ్ఞతలు. మా పేదల కష్టాలు తెలుసుకొని వాహనం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది.

– వీరలక్ష్మి, తొగలగల్లు గ్రామం, ఆస్పరి మండలం

- వాహనంలో ఏసీ సౌకర్యం, తల్లీబిడ్డతో పాటు సంరక్షురాలు ప్రయాణించేందుకు విశాలమైన సీటింగ్ సిస్టమ్ ఉంది.
- జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల వద్ద 102 వాహనాలు అందుబాటులో ఉన్నాయి. డివిజన్ కేంద్రాల్లో ప్రధాన సీహెచ్‌సీలు, మండల ప్రైమరీ హెల్త్ సెంటర్లలో వాహనాలు అందుబాటులో ఉంచారు.

రీసర్వేపై ఆందోళన వద్దు

ఆస్పరి: రీ సర్వేపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తహసీల్దార్ కుమారస్వామి సూచించారు. గురువారం మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. రైతుల పొలాలకు హద్దుల మేరకు కొలతలు నమోదు చేస్తారన్నారు. అంతేగానీ కొలతల్లో వ్యత్యాసం ఉండదని వివరించారు. బ్రిటిష్ కాలం నాటి గొలుసు ప్రకారం కొలచిన కొలతలకు ప్రస్తుతం రోవర్ కొలతలకు స్వల్ప తేడాలు మాత్రమే ఉంటాయన్నారు. అపోహలు చెందకుండా రీసర్వేకు రైతులు సహకరించాలన్నారు. ఆర్ఐ భీమేష్, సర్వేయర్ మంజుభార్గవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చిరుమాన్‌దొడ్డిలో మాట్లాడుతున్న తహసీల్దార్ కుమారస్వామి

అయోధ్య అక్షింతల పంపిణీ



వెల్దుర్తిలో అయోధ్య అక్షింతలు అందుకున్న వివిధ గ్రామాల ప్రముఖులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలోని అభయాంజనేయ స్వామి విగ్రహం వద్ద గురువారం అయోధ్య శ్రీరామ అక్షింతలను మండలంలోని 21 గ్రామాల ఆలయాల పూజారులు, గ్రామ పెద్దలకు అందజేశారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ నిర్మాణకర్త చెరుకులపాడు రామాంజనేయులు ఆధ్వర్యంలో మండల ప్రముఖులు బొమ్మన దశరథరామిరెడ్డి, శంకర్‌రెడ్డి, కర్నూలు లలితపీఠాధిపతి మేడం సుబ్రహ్మణ్యం, విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు గోరంట్ల రమణ, సుబ్బయ్య, తిమ్మయ్య చేతుల మీదుగా అక్షింతలను అందించారు. అక్షింతలు, అయోధ్య శ్రీరామ మందిర చిత్రం, ఆహ్వాన పత్రం కలిగిన బ్యాగులను ఆయా గ్రామాలకు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ అక్షింతలను గ్రామాల్లో ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. జనవరి 22న అయోధ్యలో స్వామివారి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అన్ని ఆలయాల్లో భక్తులు భజన, సంకీర్తనలు చేసి, సాయంత్రం ప్రతి ఇంటి ముందు దీపాలు వెలిగించి, హనుమత్ సమేత సీతా రామలక్ష్మణులను సేవించి అక్షింతలు వేయాలని కోరారు.

స్ట్రాంగ్ రూం పరిశీలన

ఆలూరు రూరల్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూములను ఆలూరు అసెంబ్లీ అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రామాంజనేయులు గురువారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి అంతస్తులో నాలుగు రూములను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాడ్లు, ఈవీఎం మిషన్లు భద్రపరిచి పోలింగ్ కంటే ముందు రోజు ఇక్కడి నుంచి ఆయా పోలింగ్ కేంద్రాలకు పంపిస్తామన్నారు. గదులలో వసతులు పరిశీలించారు. స్ట్రాంగ్ రూముల్లో భద్రపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బంది సూచించారు. ఎన్నికల డీటీ గుండాల్ నాయక్, ప్రిన్సిపాల్ శంకర్ ప్రసాద్ సిబ్బంది ఉన్నారు.



ఆలూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూంను పరిశీలిస్తున్న ఏఈఆర్వో రామాంజనేయులు

అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ పరిధిలో పలు వార్డుల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. పట్టణంలో రూ.51 లక్షలతో పోలీసు స్టేషన్ నుంచి సోమప్ప సర్కిల్ మీదుగా శ్రీనివాస థియేటర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి చైర్మన్ ముందస్తు చర్యను ర్యాటిఫై చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అదేవిధంగా వైఎస్సార్ సర్కిల్ నుంచి షరాఫ్ బజారు వరకు రూ.40 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి సాధారణ నిధుల నుంచి మంజూరు చేసేందుకు, 17వ వార్డు ఏరియాలోని ఇంటి నెంబర్ 112/25 నుంచి అర్బన్ హెల్త్ సెంటర్ వరకు రూ.23 లక్షలతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్ తీర్మానం చేసింది. బస్టాండ్ రోడ్డు నుంచి శ్రీనివాస టకీస్ వరకు రోడ్డు మార్కింగ్, జీబ్రా క్రాసింగ్ ఏర్పాటుకు రూ.5 లక్షలు, వైఎస్సార్ సర్కిల్ నుంచి షరాఫ్ బజార్ వరకు జీబ్రా క్రాసింగ్ లైనింగ్‌కు మరో రూ.5 లక్షలు, పట్టణంలోని 7, 9 వార్డుల్లోని కలుగొట్ల రోడ్డులో రూ.50 లక్షలు సాధారణ నిధుల నుంచి మంజూరు చేస్తూ కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అజెండాలోని 18 అంశాలతో పాటు టేబుల్ అజెండాలోని అంశాన్ని ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ ప్రకటించడతో సభ్యులు అందుకు సమ్మతించి తీర్మానించారు. మున్సిపల్ కమీషనర్ గంగిరెడ్డి, డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, విక్టర్, ఆర్‌ఓ బేబి, మేనేజర్ వరప్రసాద్, టీపీఆర్‌ఓ గోపాలకృష్ణ, ఏఈలు శరత్‌చంద్ర, మదన్, వైస్ చైర్మన్ దివ్యకళ, కోఆప్షన్ మెంబర్ అబ్రార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు

ఎల్లార్తి దర్గాల్లో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు

హొళగుంద: ఎల్లార్తి శేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి జిల్లా నుంచే గాకుండా కర్ణాటక, తెలంగాణ, ముంబై తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొని దేవుళ్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తీర్థ ప్రసాద పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి.

పరీక్ష ఫీజు చెల్లింపునకు 2వ తేదీ వరకు గడువు

తుగ్గలి: వచ్చే మార్చిలో నిర్వహించనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు జనవరి 2వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని ఎంఈఓ-2 రామవెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు తమ పరిధిలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఈ విషయం తెలిపి రూ.500 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్టీయూ వజ్రోత్సవ పోస్టర్ల విడుదల

తుగ్గలి: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) వజ్రోత్సవ వేడుకల పోస్టర్లను గురువారం తుగ్గలిలో ఎంఈవో-2 రామవెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. ఎస్టీయూ జిల్లా నాయకులు చంద్రమోహన్, చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రోపాధ్యాయ సంఘం ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనవరి 12, 13 తేదీల్లో కర్నూలు నగరంలో వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘం మండల నాయకులు సూరన్న, సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మ జ్ఞాపకార్థం.. ఆదర్శం



కల్యాణమండపంలో పూజలు చేస్తున్న దృశ్యం



దాత డి.తిమ్మారెడ్డి

పత్తికొండ రూరల్: అమ్మ ప్రేమ అజరామరం. కనిపెంచిన అమ్మానాన్నలను కొందరు వృద్ధాశ్రమాల్లో వదిలేస్తున్న ఈ రోజుల్లో ఓ తల్లి మరణానంతరం కుమారుడు ఆమె జ్ఞాపకార్థం కల్యాణమండపం నిర్మించి ఆలయానికి కేటాయించారు. పత్తికొండ మండల పరిధిలోని హోసూరు గ్రామానికి చెందిన దిద్దికాటి లక్ష్మీనరసమ్మ, సుధాకర్‌రెడ్డి దంపతుల కుమారుడు తిమ్మారెడ్డి పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌లో కూరగాయల వ్యాపారి. వ్యవసాయంతో పాటు కూరగాయల వ్యాపారం బాగా కలిసివచ్చింది. ఇతని తల్లి 20 ఏళ్ల క్రితం కాలంచేసింది. ఆమె జ్ఞాపకార్థం సమాజానికి ఉపయోగపడేలా ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నాడు. నాలుగేళ్ల క్రితం పత్తికొండ-కర్నూలు రోడ్డులోని ఈరన్న స్వామి ఆలయం పక్కనే కల్యాణ మండపం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం రూ.1.25 కోట్లు వెచ్చించినట్లు తిమ్మారెడ్డి తెలిపారు. ఈ కల్యాణ మండపాన్ని ఈరన్న స్వామి ఆలయానికి కానుకగా అందించారు. గురువారం ప్రత్యేక పూజల అనంతరం ఆర్డీఓ నీలపు రామలక్ష్మి కల్యాణ మండపాన్ని ప్రారంభించారు.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శుక్రవారం ప్రారంభించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి తెలిపారు. స్థానిక సబ్‌స్టేషన్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. ఈ యేడాది మార్చిలో చిట్యాల గ్రామంలో రూ.3.5 కోట్లతో నూతనంగా సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. తొమ్మిది నెలల్లోనే పూర్తి కావడంతో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. మండలస్థాయి అధికారులు, మండల ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు



నందవరంలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ దశరథ రామయ్య

గోనెగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం- ఆంధ్రా క్రీడా పోటీలు మూడవ రోజు గురువారం అన్ని గ్రామ పంచాయతీల్లో కొనసాగాయి. గోనెగండ్లతో పాటు పెద్దనేలటూర్, గంజిహళ్లి తదితర గ్రామాల్లోని పాఠశాలల క్రీడా ప్రాంగణాలలో వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, క్రికెట్ పోటీలు నిర్వహించగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంఈఓ నీలకంఠ పోటీలను పర్యవేక్షించారు.

నందవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ దశరథరామయ్య క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణగిరి: మండలంలోని 14 గ్రామ సచివాలయ పరిధిలో గురువారం క్రీడా పోటీలను నిర్వహించారు. ఆయా సచివాలయ పరిధిల్లో గ్రామ సర్పంచ్‌లు, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు పోటీలను నిర్వహించారు. ఇప్పటివరకు 80 శాతం పోటీలు పూర్తయినట్లు ఎంపీడీఓ రామస్వామి తెలిపారు.

ఆస్పరి: క్రీడలలో గెలుపోటములు సహజమని, స్నేహపూర్వకంగా ఆడాలని ఏంఈఓ రాజేంద్రప్రసాద్ సూచించారు. ఆస్పరిలో కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. శంకరబండ, జొహరాపురం, చిన్నహోతూరు, బిల్లేకల్లు, ముత్తుకూరు, కైరుప్పల, కారుమంచి, ములుగుందం, బనవనూరు, డీకోటకొండ, చిగిళి, బిణిగేరి, నగరూరు, తంగరడోణ, యాటకల్లు, హలిగేర గ్రామాలలో కబడ్డీ పోటీలు నిర్వహించారు.

చిప్పగిరి: మండలంలోని 9 గ్రామ సచివాలయ పరిధిలో వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. గురువారం 34 క్రీడా పోటీలు నిర్వహించినట్లు ఈఓపీఆర్డీ బాలన్న తెలిపారు.

హాలహర్వి: మండలంలోని నిట్రవట్టి గ్రామంలో ఎంఈఓ ఈరన్న వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి ఈరన్న, సర్పంచ్ గాదిలింగప్ప, హెచ్‌ఎం హకీమ్ పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ బాలుర-2 పాఠశాల గ్రౌండ్‌లో క్రికెట్, వాలీబాల్, షటిల్ పోటీలను తహసీల్దార్ రామాంజినేయులు ప్రారంభించారు. క్రీడాకారులు మంచి ప్రతిభ చాటి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. డీటీ గుండాల్ నాయక్, పీడీ కవిరాజు ఉన్నారు.

హొళగుంద: మండల కేంద్రంతో పాటు హెబ్బటం తదితర గ్రామాల్లో ఖోఖో, కబడ్డీ, క్రికెట్ పోటీలను ఎంపీడీఓ సుభాషిణి, పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుతాయని వారు చెప్పారు.



కటారుకొండలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం



పెరవలిలో విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న నాయకులు



ఆస్పరిలో క్రీడాకారులకు సూచనలు చేస్తున్న ఏంఈఓ రాజేంద్రప్రసాద్



నిట్రవట్టిలో వాలీబాల్ పోటీకి సిద్ధంగా ఉన్న క్రీడాకారులు



ఆలూరులో క్రికెట్ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్ రామాంజినేయులు



హెబ్బటంలో ఖోఖోలో తలపడుతున్న క్రీడాకారులు

శభాష్ ఎల్లారెడ్డి

నందవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో పెద్దకొత్తిలి గ్రామ సచివాలయ పరిధిలో జొహరాపురం వర్సెస్ సంజీవపురం జట్ల మధ్య క్రికెట్ పోటీ జరిగింది. 10 ఓవర్ల మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సంజీవపురం జట్టు 104 పరుగులు చేసింది. అనంతరం బరికిలోకి దిగిన జొహరాపురం జట్టు 8.5 ఓవర్లలో 105 పరుగులు చేసి గెలుపొందింది. ఆ జట్టు క్రీడాకారుడు ఎల్లారెడ్డి 20 బంతుల్లో 61 పరుగులు చేసి సత్తా చాటాడు. ఎంపీడీఓ దశరథ రామయ్య తదితరులు క్రీడాకారుడిని అభినందించారు.

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో క్రీడాపోటీల్లో విజయం సాధించిన క్రికెట్ జట్లకు సర్పంచ్ మల్లికార్జున రూ.3వేలు, ఉపసర్పంచ్ గోపాల్ రూ.2వేలు, కబడ్డీ జట్లకు శ్రీరంగనాథ స్వామి దేవాలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ రూ.3 వేలు, వైఎస్సార్‌పీ నాయకులు రామలింగారెడ్డి నగదు బహుమతులు అందజేశారు. ఈఓలు సుధాకర్, వన్నూరప్ప, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.